# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | బుధవారం,ఏప్రిల్23,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


## ఆ పోలీసు అధికారుల పేర్లు రాసి పెట్టుకుంటాం..

# రిటైరైనా వదిలేది లేదు...

- లగచర్ల బాధితులను కొంతమంది పోలీసులు వేధిస్తున్నారని తెలిసిందన్న కేటీఆర్
- మూడేళ్లలో అధికారంలోకి వచ్చి చర్యలు తీసుకుంటామన్న కేటీఆర్
- సీఎం క్షమాపణ చెప్పాలని, పోలీసులను తొలగించాలని డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టుకు వెళతామని హెచ్చరిక
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



లగచర్ల బాధితులను ఇంకా కొందరు పోలీసులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారుల పేర్లను రాసిపెట్టుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అతిగా ప్రవర్తించిన అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నా వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారువికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, లగచర్ల భూసేకరణ వివాదంలో మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తాము జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ), జాతీయ మహిళా కమిషన్‌లను ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్ఆర్సీ తీవ్రంగా తప్పుబట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. మానవ హక్కుల కమిషన్ నివేదిక తర్వాత అయినా రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు.ఎన్‌హెచ్ఆర్సీ సూచించిన విధంగా ఆరు వారాల్లోగా చర్యలు తీసుకోకుంటే రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి పాత్ర ఉందని భావించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. లగచర్లలో భూసేకరణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిం

## 'రోహిత్ వేముల' చట్టం

# తీసుకురావాలి

- 'ఎక్స్' వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీ స్ఫూర్తిదాయకమైన పిలుపు తనను బలంగా తాకిందన్న రేవంత్ రెడ్డి
- మీ లేఖను చారిత్రక నగరంలో చదివాను: రాహుల్ గాంధీ లేఖపై రేవంత్ రెడ్డి స్పందన



తెలంగాణలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు, విద్యాసంస్థల్లో వివక్షను రూపుమాపేందుకు ప్రత్యేకంగా 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాసిన లేఖపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం పార్టీ అగ్రనేత రాసిన లేఖను ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు.రాష్ట్రంలో యువతకు భద్రత కల్పించే దిశగా చట్టం అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ, దర్శన్ సోలంకి వంటి ఎందరో ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువకులు అర్ధాంతరంగా తనువు చాలించడం దురదృష్టకరమని రాహుల్ గాంధీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మొదలు రోహిత్ వేముల వరకు ఎంతో మంది ఎదుర్కొంటున్న వివక్షకు చరమగీతం పాడేలా, భవిష్యత్తులో మరెవరికీ ఇలాంటి అన్యాయం జరగకుండా ఈ కొత్త చట్టం దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు.ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ లేఖను ఎక్స్ వేదికగా పంచుకుని, తాను చారిత్రక హిరోషిమా నగరంలో ఉన్నానని పేర్కొన్నారు.

## 1.4 బిలియన్ల రోమన్ క్యాథలిక్

# తదుపరి పోప్ ఎవరు ?

**రోమన్ క్యాథలిక్ మత పీఠాధిపతి ( మత గురువు ) ఎన్నిక పైప్రత్యేక కథనం**





1.4 బిలియన్ల రోమన్ క్యాథలిక్ తదుపరి పోప్ ఎవరు ? పోప్ ఫ్రాన్సిస్ మరణంతో కొత్త పోప్ ఎన్నికకు రేసు ప్రారంభమయ్యింది. రేసులో ఇటలీకి చెందిన పియట్రో పెరొలిన్ అందరి కన్నా ముందున్నారు.ఘనాకు చెందిన పీటర్ టర్సన్ నుంచి ఆయనకు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. వీళ్లిద్దరు కూడా పోప్ ఫ్రాన్సిస్ కు గట్టి మద్దతుదారులు. కార్డినల్ పీటర్ టర్సన్ ఆఫ్రికాలో క్యాథలిక్స్ కోసం ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఫిలిప్పీన్స్ కు చెందిన కార్డినల్ లూయిస్ ఆంటోనియో కూడా పోప్ పదవి చేపట్టే అవకాశం ఉంది.హంగరీకి చెందిన పీటర్ హర్డో,ఉక్రెయిన్ కు చెందిన మైకోల బైచోక్ కూడా పోప్ పదవి కోసం పోటీ పడుతున్నారు. పోప్ చనిపోయిన నాటి నుంచి కొత్త పోప్ ను ఎన్నుకునేంత వరకు ఉండే సమయాన్ని లాటిన్ భాషలో సెడె వెకెంటే అంటారు. పొప్ పీఠం ఖాళీగా ఉందని దీనర్థం.ఈ సమయంలో కాలేజీ ఆఫ్ కార్డినల్స్ వాటికన్ వ్యవహారాలు చూస్తాయి. కాని ముఖ్య నిర్ణయాలు మాత్రం తీసుకోదు. కొత్త పోప్ ను ఎన్నుకునే ప్రక్రియ రెండు, మూడు వారాల్లో ప్రారంభమవుతుంది. కొత్త పోప్ ఎన్నిక వ్యవహారం చాలా రహస్యంగా జరుగుతుంది. ఆయనను ఎన్నుకునే సభ్యుల బృందాన్ని కాంక్లేవ్ అంటారు. 80 ఏళ్ల లోపు వయస్సున్న కార్డినల్స్ కు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది.ఈ ఓటింగ్ అనేక దఫాలుగా జరుగుతుంది.


### ఓటింగులో పాల్గొనేది మొత్తం 138 మంది కార్డినల్స్...

ప్రస్తుతమున్న కార్డినల్స్ లో80 శాతం మందిని పోప్ ఫ్రాన్సిస్ నియమించారు.మొత్తం 138 మంది కార్డినల్స్ ఉన్నారు. ఇందులో భారత్ నుంచి నలుగురు ఉన్నారు. హైదరాబాద్ ఆర్చిబిషప్ పూల ఆంథోనిఅందులో ఒకరు. ఆయనతో పాటు గోవా కార్డినల్ ఫిలెప్పీ నెరీ ఫెరారో, కేరళకు చెందిన కార్డినల్ క్లీమీస్ బసేలియోస్,జార్జ్ జాకబ్ పోప్ ఎన్నిక ఓటింగ్ కు హాజరవుతారు.కార్డినల్ పూల ఆంథోని అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. దళిత వర్గం నుంచి ఈ స్థాయికి ఎదిగిన తొలి భారతీయ కార్డినల్ గా ఆయన రికార్డు సృష్టించారు.పోప్ గా ఎన్నికయ్యే వ్యక్తికి మూడింట రెండొంతల మెజార్టీ రావాలి. ఒకవేళ నిర్ణయం తీసుకోని పక్షంలో వాటికన్ సిస్టెన్ చాపెల్ చిమ్నీ నుంచి నల్లటి పొగ విడుదల చేస్తారు. దానర్థం ఓటింగ్ ఇంకా కొనసాగుతోందని అర్థం.ఒకవేళ పోప్ ను కార్డినల్స్ ఎన్నుకున్నట్లు అయితే సిస్టెన్ చాపెల్ నుంచి తెల్ల పొగ విడుదల చేస్తారు. కొత్తగా ఎన్నుకున్న వ్యక్తిని ఆ బాధ్యతలు చేపట్టేందుకు సుముఖంగా ఉన్నారా అని అడుగుతారు.వారుఒప్పుకున్నట్లు అయితే వాటికన్ సెయింట్ పీటర్స్ బెసిలికా బాల్కనీ నుంచి ఆయనను ప్రపంచానికి పరిచయం చేస్తారు. పోప్ గా ఆయనకు కొత్త పేరు పెడతారు.ఈసారి జరిగే పొప్ పోటీలో ఇటలీకి చెందిన కార్డినల్ పిఎట్రో పారోలిన్,హంగెరీకి చెందిన కార్డినల్ పీటర్ ఎర్డో,ఫిలిప్పీన్స్ చెందిన కార్డినల్ లూయిస్ ఆంటోనియో టాగ్లే,ఇటలీకి చెందిన కార్డినల్ మాట్టియో జుప్పి,యునైటెడ్ స్టేట్స్ కు చెందిన కార్డినల్ రేమండ్ లియో బుర్కే,నెదర్లాండ్స్ కు చెందిన కార్డినల్ విల్లం జాకోబస్గ్,ఘానకు చెందిన కార్డినల్ పీటర్ టర్క్ సన్,శ్రీలంకకి చెందిన కార్డినల్ మాల్కమ్ రంజిత్,జర్మనీకి చెందిన కార్డినల్ ముల్లర్ లో పోటీలో ఉండే అవకాశమున్నది.

## దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో

# పర్యాటకులపై ఉగ్రదాడి

- ప్రభుత్వ వర్గాల ప్రకారం కనీసం 25 మంది మృతి
- మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన రావాల్సి ఉందన్న సీఎం ఒమర్ అబ్దుల్లా
- దాడిని ఖండించిన ప్రధాని మోదీ, కఠిన చర్యలకు ఆదేశం
- పరిస్థితి సమీక్షకు శ్రీనగర్ బయలుదేరిన హోం మంత్రి అమిత్ షా



**దక్షిణ కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన పహల్గాంలో తీవ్ర ఉగ్రదాడి జరిగింది. పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో కనీసం 20 నుంచి 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రాథమికంగా వెల్లడించాయని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.**

దక్షిణ కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన పహల్గాంలో తీవ్ర ఉగ్రదాడి జరిగింది. పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో కనీసం 20 నుంచి 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రాథమికంగా వెల్లడించాయని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ ఘటనతో కశ్మీర్ లోయ మరోసారి ఉలిక్కిపడింది.మృతుల సంఖ్యను ఇంకా ధృవీకరించాల్సి ఉందని, పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో పౌరులే లక్ష్యంగా జరిగిన దాడుల్లో ఇది అత్యంత తీవ్రమైనదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న ఒక ఆసుపత్రిలోని వైద్యుడు మాట్లాడుతూ, ఈ ఘటనలో గాయపడిన 12 మంది తమ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు.పర్యాటకుల వివరాల కోసం అనంత్‌నాగ్ పోలీసులు అత్యవసర సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పర్యాటకులకు సహాయం లేదా పర్యాటకుల సమాచారం కోసం ఈ ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వివరాలు తెలుసుకోవాలనుకునే వారు 9596777669, 01932225870 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని లేదా 9419051940 నెంబర్‌కు వాట్సాప్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. ఈ దాడిలో దాదాపు 20 మంది మరణించినట్టు తెలుస్తోంది.పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపిన ప్రధాని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.దాడి వెనుక ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారి దుష్ట అజెండా ఎప్పటికీ విజయవంతం కాదని అన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం అచంచలమైనదని, ఇలాంటి దాడుల వల్ల అది మరింత బలపడుతుందని అన్నారు.పర్యాటకులపై దాడి ఘటన తీవ్రంగా బాధించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని అన్నారు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఘటన గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించానని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళుతున్నట్లు తెలిపారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి.. జారీ చేసిన 21 జీవోను సవరించాలి

- భర్తీలో యూజీసీ గైడ్ లైన్స్ అమలు చేయాలి
- పీహెచ్ డీకి 30మార్కులు కేటాయించాలి
- తెలంగాణ నిరుద్యోగులకే అధిక ప్రాధాన్యత
- ఓయూ వీసీకి టీజీడీఏ వినతి పత్రం



హైదరాబాద్, ప్రజా ముచ్చట(ఏప్రిల్ 22):రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో చేపట్టబోయే ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి జారీ చేసిన జీవో నెంబర్ 21ని. సవరించాలని తెలంగాణ డాక్టోరేట్స్ అసోసియేషన్(టీజీడీఏ) విజ్ఞప్తి చేసింది. యూజీసీ–2018 గైడ్ లైన్స్ ను అమలు చేయాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో పీహెచ్ డీకి 10 మార్కులు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రతినిధులు.. 30 మార్కులకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, గైడ్ లైన్స్ కమిటీ సభ్యులు మొలుగారం కుమార్ కి టీజీడీఏ అధ్యక్షులు డాక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు డాక్టర్ రమణ రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ బొల్లం తిరుపతి, ప్రతినిధులు డాక్టర్ స్వప్న, డాక్టర్ విజయ్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ స్వామి నాయక్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ శ్రీనివాస్ లు వినతి పత్రం సమర్పించారు. జీవో 21 వల్ల తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి జారీ చేసిన 21 జీవోను సవరించి.. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. నియామక ప్రక్రియలో డెమో,ఇంటర్వ్యూలకు అధికంగా 30 మార్కులు కేటాయించడం నియామక అధికారుల వ్యక్తిగత విచక్షణకు ఎక్కువ అవకాశం ఇవ్వడంతో పాటు.. పారదర్శకత ఉండదని గుర్తు చేశారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు పెట్టిన అసోసియేట్ ప్రొఫెసర్ నిబంధనలను తొలగించిలని డిమాండ్ చేశారు. పీడీఎఫ్ కి ఎక్కువ మార్కులు కేటాయించాలని కోరారు. నియామక ప్రక్రియలో ఏబీసీ గ్రూపులను తొలగించి ఒకే గ్రూపుగా పరిగణించాలని సూచించారు. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్–నెట్ లేదా పిహెచ్డి వంటి కనీస అర్హతలను తప్పనిసరి చేయకపోవడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్నారు. యూజీసీ నిబంధనలను విస్మరిస్తే అర్హులైన అభ్యర్థులు ఎంపిక కాకపోవచ్చని, రాష్ట్రంలోని ఉన్నత విద్యా ప్రమాణాలు దిగజారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డెమో, టీచింగ్ స్కిల్స్ ని ఇంటర్వ్యూ లో నే కలుపాలని కోరారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి కొత్త చట్టం

- సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం
- కొత్త చట్టంతో భూధార్ కార్డులు
- భూభారతి అవగాహన సదస్సులో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్








పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, ఏప్రిల్ 22:భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి న్యూ ఆర్ ఓ ఆర్ చట్టం 2025 అని, భూ సమస్యల పరిష్కారానికే భూభారతి కొత్త చట్టం అని, దీని ద్వారా సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం ఉన్నదని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఈ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మనిషికి ఆధార్ కార్డులా ప్రతి భూ కమతానికి భూదార్ కార్డులు అందజేస్తామని అన్నారు. ధరణి పోర్టల్ ద్వారా సామాన్య రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేకపోయారని అన్నారు . మండల కేంద్రంలోని సత్యా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం 2025 పై రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం జాతీయగీతం ఆలపించిన తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం 2025 తీసుకొచ్చిందన్నారు. ధరణి పోర్టల్ లోని వివాదాస్పద అంశాలను తొలగించిన ప్రభుత్వం మరిన్ని సవరణలు చేయడం వల్ల పేదోడు భూములకు రక్షణగా ఈ చట్టం నిలిచిందన్నారు ఈ కొత్త చట్టం వల్ల రైతులు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అణువుగా ఉందన్నారు. ఈ పోర్టల్ లో చిన్న చిన్న తప్పులను కూడా సరిచేసుకునే వెసులుబాటు కల్పించారని అన్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తులకు పరిష్కారం చూపే విధంగా కొత్త చట్టం ఉందన్నారు. రైతులు ప్రతి చిన్న విషయాలకు కలెక్టర్ ను, కోర్టులను ఆశ్రయించే వారని పేర్కొన్నారు. వారసత్వం, భూ హద్దులు తదితర అంశాలపై ప్రజలకు పూర్తి న్యాయం భూభారతి ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాపురం, భక్తలాపురం గ్రామాల మహిళలు తమ భూ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలో గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు మాట్లాడుతూ మండల కేంద్రంలో భూభారతిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి అధికారులకు మండల రైతులు, ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పిఎసిఎస్ ద్వారా నిర్వహించబడుతున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని అదేవిధంగా అనాజిపురం గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్, అధికారుల బృందం సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాంబాబు, ఆర్ డి ఓ వేణు మాధవ రావు, స్థానిక ఇన్చార్జి తహశీల్దార్ ధరావత్ లాలునాయక్, ఎంపీడీవో జే. వెంకటేశ్వరరావు, సూర్యాపేట తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ నాయక్, ఎస్సై కస్తాల గోపికృష్ణ, ఏపీఎం అజయ్ నాయక్, ఏపీవో రవి, టి పి సి సి కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితర అధికారులు, సిబ్బంది, పిఎసిఎస్ సీఈఓ సోమ్లా నాయక్, సిబ్బంది ఒగ్గు సైదులు, ఐకెపి నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పలు గ్రామాల రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాల గురించి ప్రజలను చైతన్య పరచాలి :డిఈఓ అశోక్



పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాల గురించి ప్రజలను చైతన్య పరచాలనీ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని డిఈ ఓ అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిభా గురుకుల పాఠశాలలో మండల విద్యాధికారి నకిరేకంటి రవి అధ్యక్షతన మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాలు, సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులతో పాఠశాల వారీగా సమీక్ష జరిపారు. అనంతరం ప్రతి గ్రామంలో గ్రామ విద్యా రిజిస్టర్లను తయారు చేయాలని తద్వారా బడి ఈడు పిల్లలను గుర్తించాలని ఆయన అన్నారు. వేసవిలో బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు, సాంకేతిక విద్యా ప్రమాణాలను గురుంచి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల ద్వారా విద్యార్థుల స్థాయి ప్రమాణాలను అనుసరించి వెనుకబడిన విద్యార్థులలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని, సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మానిటరింగ్ అధికారి వస్రం నాయక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ప్రభాకర్, సీఆర్పీలు సైదయ్య, వాహిద్, నాగు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.కోటా చలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ ను పరిశీలన చేసుకోవాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయగా ఆరోగ్య సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల విధి, విధానాలపై మరొకసారి దిశానిర్దేశం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి పరిసర ప్రాంతాలను సందర్శించి ఆసుపత్రి ఆవరణాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవంతి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

# పాఠశాల స్వీపర్ కి ఘన సన్మానం



- పదవి విరమణ పొందిన స్వీపర్ బుర్రి వీరమ్మ

పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట, ఏప్రిల్ 22: మండల పరిధి లింగాల గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల యందు స్వీపర్ గా విధులు నిర్వహిస్తున్న బుర్రి వీరమ్మ సోమవారం పదవి విరమణ పొందగా ప్రధానోపాధ్యాయులు బుడిగం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో వీరమ్మ స్వీపర్ గా విధులు నిర్వహించారని, తన విధులను అంకితభావంతో నిర్వహించేవారని అన్నారు. ఈ సందర్భంగా పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపి ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పూలదండలతో, శాలవాలతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందు, శ్రీనివాసరెడ్డి, సతీష్, ఏఏపిసి చైర్మన్ శాంత కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

# భారత కమ్యూనిస్టు పార్టీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభ తమిళనాడులోని మదురై నగరంలో విజయవంతంగా నిర్వహించడం ముదావహం. గత దశాబ్ద కాలంలో పార్టీ అనుసరించిన రాజకీయ విధానం, దాని అమలు తీరును ఆత్మవిమర్శనా పూర్వకంగా ఒక సమీక్షా నివేదికను రెండు నెలల ముందే పార్టీ శ్రేణులకు అందించి దానిపై శాఖ మొదలు అన్ని స్థాయిల్లో చర్చ అనంతరం మహాసభలో కూలంకషంగా చర్చించడం ప్రజాస్వామిక పని తీరుకు నిదర్శనం. రాజకీయ విధాన సమీక్ష ప్రాతిపదికగా రూపొందించిన రాజకీయ తీర్మానాన్ని బహిరంగంగా విడుదల చేసి సవరణలు, సూచనలు, సలహాలు ఆహ్వానించి, వాటిపైనా మహాసభ చర్చించింది. ఆమోదించిన రాజకీయ విధానాన్ని ఆచరణలోకి తేవడానికి పార్టీ నిర్మాణ పటిష్టత పెంచడానికి తీసుకోవలసిన చర్యలను గురించి నిర్మాణ నివేదిక మార్గ నిర్దేశనం చేసింది. ఈ మూడు డాక్యుమెంట్లపై కూలంకషమైన చర్చ సాగించి అన్నిటినీ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించడం ఒక ముందడుగు. ఆ రీత్యా 'పార్టీ ఐక్యతకు పటిష్టతకు ఈ మహాసభ ప్రతీక' (దిస్ ఈజ్ ఎ కాంగ్రెస్ ఆఫ్ యూనిటీ అండ్ కన్సాలిడేషన్) అని వ్యాఖ్యానించడం సరైనది. సిపిఐ(ఎం) స్వతంత్ర శక్తిని పెంచుకోవాలనీ వామపక్ష ఐక్యతను పెంపొందించాలని మహాసభ తీసుకున్న నిర్ణయం ఎంతో సబబైనది. సామ్రాజ్యవాదాన్ని, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిని నఖశిఖ పర్యంతం వ్యతిరేకించడం, సోషలిజం పట్ల మహాసభ అచంచల విశ్వాసం వ్యక్తం చేయడం కొనియాడదగినది. దేశంలో నయా ఫాసిస్టు ధోరణులు వ్యక్తమవుతున్నాయనీ కార్పొరేట్–మతతత్వ కూటమిని ఒంటరి చేసి ఓడించాలని మహాసభ ఏకగ్రీవంగా నిర్ణయించిన కీలక పిలుపు ఆచరణాత్మకమైనది. ఈనాటి పరిస్థితులను మార్చి శ్రమజీవుల రాజ్యానికి బాట వేసేందుకు అదే సరైన మార్గం!అఖిల భారత మహాసభలో పార్టీ విధాన నిర్ణయాలు చేసే కేంద్ర కమిటీని, వాటిని అమలు చేయడానికి పొలిట్‌బ్యూరోను, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఎ బేబి ఎన్నికయ్యారు. 85 మందితో కూడిన కేంద్ర కమిటీలో 35 మంది కొత్తగా రావడం, అందులో మహిళలు, అణగారిన తరగతులకు చెందినవారి ప్రాతినిధ్యం పెరగడం శ్లాఘనీయం. పార్టీ నిబంధనలు అందరికీ శిరోధార్యమంటూ నిర్దేశిత వయసు మీరిన హేమాహేమీలు స్వచ్ఛందంగా తప్పుకొని తమ బాధ్యతలను తమకంటే చిన్నవారికి అప్పగించడం ఆ పార్టీకే చెల్లింది! కొన్ని ప్రధానమైన జాతీయ అంతర్జాతీయ సమస్యలపై వివిధ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. తద్వారా పాలకుల విధానాలను ఎండగట్టడంతోపాటు ఆయా అంశాలపై పార్టీ వైఖరిని కూడా వెల్లడించింది.భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో పార్టీ అఖిల భారత మహాసభలను మూడు సార్లు నిర్వహించిన ఘనత మదురై నగరానికి దక్కింది. మహాసభకు ముందు మదురైలో, తమిళనాట నలుదిక్కులా వివిధ సమకాలీన అంశాలపై 50కి పైగా సదస్సులు నిర్వహించారు. నిష్ణాతులైన నిపుణులూ ఉద్దండ రాజకీయవేత్తలూ వాటికి హాజరు కావడంతో రాష్ట్రమంతటా విస్తారమైన చర్చకు దోహదపడడం గమనార్హం. ఏప్రిల్ 3న ఫెడరలిజంపై జరిగిన సదస్సు వాటికి కొస మెరుపు! కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు హాజరై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్ష పాలిత రాష్ట్రాలపట్ల అనుసరిస్తున్న వివక్షను ఎండగట్టారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను దెబ్బతీస్తున్న నిరంకుశ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లౌకికవాదులు, దేశభక్తియుత శక్తులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. చెన్నై మహానగరంలో మహనీయుడు కారల్ మార్క్స్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామన్న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన స్వాగతించదగినది. మహాసభ ముగింపుగా ఆదివారంనాడు మదురై అరుణార్ణవమైంది. భారీ బహిరంగసభ సిపిఐ(ఎం) ప్రతిష్టను ఇనుమడింపజేసింది. వేలాదిమంది యువతీ యువకులతో సాగిన ఎర్ర దండు కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముమ్మాటికీ 'భవిష్యత్తు ఎర్ర జెండాదే'నని సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభ చాటి చెప్పింది.నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడిపోతాం/ నీటితనంలో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు ప్రొ.ఎన్.గోపి. కాల్వలై, వాగులై, వంకలై, నదులై,